సాగునీరులేక ఎండుతున్న వరిచేలు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో మత్స్యపురి, బాలేపల్లి, మెంటేపూడి గ్రామాల్లో సాగునీరు లేక వరిచేలు ఎండిపోతున్నాయని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సిపిఎం మండల కార్యకర్తల విస్తృత సమావేశం బొర్ర అలమహారాజు అధ్యక్షతన జరిగింది. నరసింహమూర్తి మాట్లాడుతూ ఇప్పుడే నీరందించకపోతే రానున్న రోజుల్లో ఇబ్బంది తప్పదన్నారు. వంతుల వారీ విధానం పెట్టినా నీరందడం లేదన్నారు. ఇరిగేషన్ అధికారులు తక్షణం గ్రామాల్లో పర్యటించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. తక్షణం రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రెడ్డి రామారావు లింగం సత్యనారాయణ కేతా జ్యోతిబాసు, బొమ్మనపల్లి సూర్యచంద్రరావు అయినపూడి బాబూరావు, గొట్టుముక్కల శ్యామ్ బాబు, జుత్తిగ సాంబయ్య పాల్గొన్నారు.

ఎన్నికల కోలాహలం..!

అధినేతల పర్యటనలతో వేడెక్కుతున్న రాజకీయం

నియోజకవర్గాల్లో పోటాపోటీగా ప్రచారం

అభ్యర్థుల ప్రకటనపై తాత్సారంతో జనసేన, టిడిపి శ్రేణుల్లో నిస్తేజం

భీమవరంలో పవన్ పోటీకి సిద్ధమవడంతో విస్తృత చర్చ

గత ఎన్నికల ఓట్ల లెక్కలతో గెలుపోటములపై అంచనాలు

తాడేపల్లిగూడెంలో టిడిపి, జనసేన సభకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. అధినాయకుల పర్యటనలతో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఇప్పటికే దెందులూరులో సిఎం సభ జరగడం, భీమవరంలో సాగిన పవన్ పర్యటనతోపాటు ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరగనున్న టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల సభతో ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది. గ్రామాల్లో సైతం ఏ ఇద్దరు కలిసినా ఎన్నికలపై చర్చ సాగుతోంది. నియోజకవర్గాల్లో టిడిపి, జనసేన, వైసిపి నాయకులు తమ ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇప్పటి నుంచే ఏ పార్టీ ఎన్ని సీట్లు సాధిస్తుందనే లెక్కలు కడుతున్న పరిస్థితి ఉంది. టిడిపి, జనసేన పార్టీలకు సంబంధించి అభ్యర్థుల ప్రకటన వెలువడకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత నిస్తేజం కొనసాగుతోంది. తాడేపల్లిగూడెంలో జరగనున్న టిడిపి, జనసేన ఉమ్మడి సభను విజయవంతం చేసేందుకు ఆయా పార్టీల నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో బిజెపి సైతం ఏలూరు ఇండోర్‌స్టేడియంలో ఈ నెల 27న ప్రజాపోరు పేరుతో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా ఎన్నికల సభ జరిపేందుకు సిద్ధమైంది. దీంతో ఉమ్మడి జిల్లాలో రోజురోజుకీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. త్వరలో జరగనున్న ఎన్నికల సరళిపై అనేక రకాలుగా రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. 2014 ఎన్నికల్లో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా గెలుచుకున్నాయి. ఆ ఎన్నికల్లో జిల్లా నుంచి వైసిపికి అసెంబ్లీలో ప్రాతినిధ్యం అనేది లేకుండాపోయింది. 2019 ఎన్నికలకొచ్చేసరికి పరిస్థితి తారుమారైంది. 15 అసెంబ్లీ స్థానాల్లో 13, రెండు ఎంపీ స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. భీమవరం నుంచి పోటీ చేసిన పవన్‌కల్యాణ్ సైతం ఓటమి పాలయ్యారు. రెండుసార్లు రాష్ట్రంలో అధికారంలో రావడానికి జిల్లాలో గెలుపొందిన స్థానాలు ఆయా పార్టీలకు కీలకంగా మారాయి. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపై వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ప్రధానంగా కేంద్రీకరించిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో అత్యధిక స్థానాలను దక్కించుకుంటేనే అధికారంలోకి వస్తామని అంచనా వేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి పొత్తుతో ముందుకు నడుస్తున్నాయి. జిల్లాలో కాపు సామాజిక తరగతి ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. దీంతో టిడిపి, జనసేనకు ఎన్ని స్థానాలు వస్తాయి, వైసిపికి ఎన్ని స్థానాలు వస్తాయనే లెక్కలు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ఎన్నికల్లో టిడిపికి, జనసేనకు వచ్చిన ఓట్లను నియోజకవర్గాల వారీగా లెక్కలు తీస్తున్నారు. 2019లో భీమవరం నుంచి పోటీ చేసిన పవన్‌కల్యాణ్ 8,400 ఓట్ల తేడాతో వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌పై ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులుకు 50 వేలకుపైగా ఓట్లు వచ్చాయి. దీంతో టిడిపి, జనసేన ఓట్లు కలిస్తే పవన్ కచ్చితంగా గెలుస్తాడని అంచనాలు వేస్తూ ఇప్పటి నుంచే బెట్టింగ్‌లు సాగిస్తున్నారు. ఏలూరు నుంచి టిడిపి తరపున పోటీ చేసిన బడేటి బుజ్జి రెండువేలకుపైగా ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఆ ఎన్నికల్లో జనసేన అభ్యర్థికి 15 వేలకుపైగా ఓట్లు వచ్చాయి. ఈసారి రెండు పార్టీలు కలిసి పోటీ చేయడంతో గెలుపు తథ్యమని లెక్కలు కడుతున్నారు. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల ఆధారంగా గెలుపోటములపై అంచనాలు వేస్తున్నారు. తాము చేపట్టిన సంక్షేమ పథకాలు తమను కచ్చితంగా గెలిపిస్తాయని వైసిపి ధీమాగా ఉంది. టిడిపి, జనసేనతో బిజెపి పొత్తు కుదుర్చుకున్నా జిల్లాలో ఓట్లపరంగా పెద్దగా కలిసొచ్చే అంశం కన్పించడం లేదు. అనేక లెక్కలు, ప్రచారాలతో ఎన్నికల కోలాహలం సాగుతోంది.

గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఎపిపిఎస్‌సి గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లు, లైజాన్ ఆఫీసర్లు, అబ్జర్వర్లతో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. 37 సెంటర్లను ఏర్పాటు చేశారని, భీమవరం డివిజన్‌లో 21, నరసాపురం డివిజన్‌లో 3, తాడేపల్లిగూడెం డివిజన్‌లో 13 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆబ్జెక్టివ్ విధానంలో ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్న పరీక్షలకు 14,546 మంది హాజరు కానున్నారన్నారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు సమన్వయ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 37 మంది చొప్పున లైజాన్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, జిల్లా అధికారులను 17 మందిని రూట్‌ఆఫీసర్లుగా నియమించారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు, తిరిగి గమ్యాలకు చేరేందుకు అభ్యర్థులకు అనువుగా ఆర్‌టిసి బస్సులు, రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేసుకోవాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల హాల్ టికెట్, ఒరిజినల్ ఫొటో ఐడితోపాటు నిర్దేశించిన గుర్తింపు కార్డుతో పరీక్షా కేంద్రానికి ముందుగా హాజరు కావాలన్నారు. సమావేశంలో భీమవరం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, కె.చెన్నయ్య, ఎపిపిఎస్‌సి సెక్షన్ అధికారి జె.జయంతి, ఎఎస్ఒ ఎ.నాగలక్ష్మి, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా రవాణాధికారి టి.ఉమామహేశ్వరరావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, హౌసింగ్ ఇఇ బి.వెంకటరమణ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఎ.రామస్వామి, బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి.గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, ఐసిడిఎస్ జిల్లా అధికారి బి.సుజాతరాణి, జిల్లా ట్రైబల్ అధికారి డి.పుష్పరాణి, డిఎల్‌డిఒ ఎవి.అప్పారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి పిహెచ్‌జిఆర్.పాపారావు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ప్రయివేటు కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు వేయడం పౌరుని బాధ్యత

కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

ప్రజాశక్తి - భీమవరం

ఓటును పవిత్రంగా వేసినప్పుడే ప్రజాస్వామ్యానికి మార్గదర్శకం అవుతుందని, ప్రతి పౌరుడూ ఓటు వేయడం బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో శ్రీ విజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటుహక్కు వినియోగ ప్రచార బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేసే ముందు ఒకటికి, రెండుసార్లు ఆలోచించి సమర్థవంత నాయకత్వానికి ఓటు వేసి అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ముఖ్యంగా స్వీప్ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు పాల్గొని సేవలందించడం అభినందనీయమన్నారు. ఎటువంటి ప్రలోభాలకూ లొంగకుండా ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. నెల రోజుల నుంచి భీమవరం పట్టణ, గ్రామీణ పాఠశాలలు, కళాశాలలు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు తదితర ప్రదేశాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు కలెక్టర్‌కు వివరించారు.

హామీలు అమలు మరిచి.. అమానుష దాడులా?

రైతుల పట్ల బిజెపి ప్రభుత్వాల తీరు దారుణం - సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

శుభకరన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

నాడు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఢిల్లీ వెళ్తున్న రైతులపై హర్యానా పోలీసులు దుర్మార్గంగా కాల్పులు జరిపి యువరైతు శుభ్‌కరణ్ సింగ్‌ను బలిగొనడం మోడీ ప్రభుత్వ హత్యేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. యువరైతు శుభకరణ్‌సింగ్ మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద రైతు చిత్రపటానికి సీతారాం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా దాడి చేయించడం, ఒకరి ప్రాణాలు బలిగొనడంతోపాటు అనేకమంది గాయాల పాల్జేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా కార్పొరేట్లకు మేలు జరిగేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ శాంతియుతంగా పోరాడుతున్న రైతులపై బిజెపి పాలకుల తీరు బాధాకరమన్నారు. దేశ సరిహద్దుల్లో ఉగ్రవాదులపై దాడులు చేసినట్లు అన్నదాతలపై చేయడం దారుణమన్నారు. పోలీసుల దాడుల్లో అనేకమంది గాయాల పాలవ్వడానికి కారకుడైన ఘనత మోడీదేనన్నారు. ఇప్పటికైనా రైతుల సమస్యలు పరిష్కరించకుంటే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, బి.కళ్యాణి, కేతా గోపాలన్, కె.పెద్దిరాజు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు జుత్తిగ నరసింహమూర్తి, కె.రాజారామ్మోహన్‌రాయ్, ఎ.అజయకుమారి, జక్కంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విస్సాకోడేరులో రాస్తారోకో చేస్తున్న నేతలు

పాలకోడేరు: హర్యానాలో రైతులపై కాల్పులు జరపడం దారుణమని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు.

గతంలో రైతులకిచ్చిన హామీలను అమలుచేయాలని శాంతియుతంగా పోరాడుతున్న రైతులపై హర్యానాలోని బిజెపి ప్రభుత్వం కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండించారు. విస్సాకోడేరులో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషపు అసిరయ్య, రైతులు కలిదిండి గోపాలరాజు, యిర్రింకి వెంకటేశ్వర్లు, కండిబోయిన రమణ, మారగాని కొండ, శిద్దాబత్తుల ఏసోబు, కంది ఆనంద్, అంగర రామకృష్ణ, ఇళ్ల రాంబాబు, దుండి తిలక్ పాల్గొన్నారు.

తణుకు రూరల్: రైతులపై కాల్పులు, దమనకాండను నిరసిస్తూ స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు, ఎఐటియుసి, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఎఐటియుసి నాయకులు బొద్దాని నాగరాజు, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి దిర్శిపో రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో గార రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, పి.దక్షిణామూర్తి, బొద్దాని మురళీకృష్ణ, బి.సత్యనారాయణ, కిషోర్, గణేష్, బ్రహ్మాజీ, చిన్నారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇరగవరం: ఢిల్లీలో మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరగవరంలో చేపట్టిన ఆందోళననుద్దేశించి కామన మునిస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో ఇల్లింద్రపర్తి సత్యనారాయణ, ఎస్.ముసలయ్య, పిన్ని కోటేశ్వరరావు, పిల్లి ఏడుకొండలు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, కేతా సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల సమస్యలు పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం సిపిఎం జిల్లా కమిటీ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా జగనన్న కాలనీల్లో కనీసం మౌలిక వసతులు కల్పించలేదన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానవాటికలు వంటివి ఇప్పటికీ కనిపించలేదన్నారు. ఎన్నో గృహాలు పునాదుల్లోనే మిగిలిపోయాయన్నారు. పట్టణాల్లోని టిడ్కో ఇళ్ల పంపిణీ నేటికీ పూర్తిచేయకపోవడం దారుణమని విమర్శించారు. కొన్ని బిల్డింగులు నీరుగారుతున్నాయన్నారు. మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జగనన్న ఇళ్ల కాలనీలు, టిడ్కో ఇళ్ల సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని సీతారాం హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ డెల్టాలో పలు ప్రాంతాల్లో సాగునీటి కొరతతో చేలు బీటలు వారుతున్నాయన్నారు. ఎండలు ముదరడంతో రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఒకవైపు తాగునీటి కాలుష్యం మరో వైపు శివారు ప్రాంతాలకు నీరందక ప్రజలు అవస్థలు పడతున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తామని బలరాం హెచ్చరించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల ఆందోళనలకు సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ప్రత్యేక తీర్మానంలో మద్దతు తెలియజేసింది. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు జెఎన్‌వి గోపాలన్, చింతకాయల బాబూరావు, కౌరు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, పివి.ప్రతాప్ పాల్గొన్నారు.

తాళ్లకోడులో ఇంకెన్నాళ్లీ కష్టాలు

మౌలిక వసతుల్లేక జగనన్న కాలనీవాసుల విలవిల - సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న తాళ్లకోడు వాసులు

'ఎన్నోఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నాం.. కనీస సౌకర్యాలు లేక అల్లాడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.. ఇంకా ఎన్నాళ్లీ కష్టాలు, కన్నీళ్లు' అని ఆకివీడులోని తాళ్లకోడు జగనన్నవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందలాది మంది నివాసముంటున్న తమను కనీసం మనుషులుగా గుర్తించకపోవడం అత్యంత బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని వాపోయారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేయాలని, విద్యుత్ బిల్లులు తగ్గించాలని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ సొమ్ము పూర్తిగా అందించాలని, అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య వైఖరి వీడాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద తాళ్లకోడువాసులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఆకివీడు పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ 25 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా 2020లో మూడు వేల మందికి తాళ్లకోడులో ఇళ్ల స్థలాలు కేటాయించామని గుర్తు చేశారు. ప్రస్తుతం 400 మంది ఇళ్లు నిర్మించుకున్నారని, మరో వెయ్యి ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. అతిపెద్ద కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం అత్యంత దారుణమన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజల అవస్థలు వర్ణనాతీతమన్నారు. తక్షణం తాళ్లకోడు కాలనీలో అన్ని సమస్యలూ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీకి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పెంకి అప్పారావు, సందక సూరిబాబు, బివి.వర్మ, బాధిత లబ్దిదారులు పిసిని వరలక్ష్మి, రమణ, మంగతాయారు, కృష్ణవేణి, పద్మ, ఏసు, శ్రీను, జయలక్ష్మి పాల్గొన్నారు.

29న ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహనా సదస్సు

హాజరుకానున్న శాసనమండలి ఛైర్మన్, కలెక్టర్, ఎస్‌పి

ప్రముఖ సామాజికవేత్త రాజాసుందర్‌బాబు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 29న భీమవరం వీరమ్మ పార్క్ సెంటర్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజాసుందరబాబు తెలిపారు. స్థానిక ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ కార్యాలయంలో శుక్రవారం అవగాహనా సదస్సుకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజాసుందరబాబు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి చట్టం 1989, సవరణల చట్టం 2015, 2018- ఎస్‌సి, ఎస్‌టి రూల్స్, సంబంధిత జిఒలపై అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, ఎస్‌పి వేజెండ్ల అజిత తదితర ప్రముఖులు, ఎస్‌సి, ఎస్‌టి జిల్లా విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు హాజరుకానున్నారన్నారు. ఈ అవగాహనా సదస్సును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, ఎస్‌సి, ఎస్‌టి జిల్లా విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ మాట్లాడుతూ ఉదయం పది గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. మాలమహానాడు ఉపాధ్యక్షులు గొడి పెద్దిరాజు, ఏసుపాదం పాల్గొన్నారు.

చదువులోనూ దళితుల పట్ల వివక్షేనా

కెవిపిఎస్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఉండి

కెవిపిఎస్ ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న విద్యార్థులు, నేతలు

అర్తమూరు గ్రామంలో ఎస్‌సి, బిసి విద్యార్థులకు పాఠశాల భవనం నిర్మించాలని, లేనిపక్షంలో విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని కె.క్రాంతిబాబు హెచ్చరించారు. శుక్రవారం ఉండి మండలం అర్తమూరు గ్రామంలో ఎస్‌సి, బిసి విద్యార్థులకు పాఠశాల నూతన భవనం నిర్మించాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. విద్యార్థులు రోడ్డుపై చదువుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ అర్తమూరులో ఏళ్ల తరబడి సిబిసిఎన్‌సి ఆధ్వర్యంలో పాఠశాల నడిచిందని తెలిపారు. గత సంవత్సర కాలంలో ఆ సంస్థ కొన్ని కారణాల రీత్యా పాఠశాలను ప్రభుత్వానికి అప్పగించిందన్నారు. ప్రభుత్వాధికారులు ఉపాధ్యాయులను డిప్యూటేషన్ ద్వారా పాఠాలు చెబుతున్నారని తెలిపారు. సుమారు 45 మంది ఎస్‌సి, బిసి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. సంవత్సరం నుంచి విద్యార్థులకు పాఠశాల భవనం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలకు భవనాన్ని నిర్మించాలని మండల, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సర్పంచి గోనబోయిన వీర్రాజు, ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు (కలిసిపూడి రాము) మాట్లాడారు. తక్షణం భవనం నిర్మించాలని లేనిపక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు కింతాడ రమేష్, మాదాసి గోపి, నాయకులు చొప్పర్ల చిట్టిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పోడూరు

పోడూరులో వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన కోరుతూ వైసిపి మండల కన్వీనర్ పితాని సత్యనారాయణకు నేతలు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పాత పెన్షన్ అమలు చేయాలని అధినాయకత్వం దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని యుటిఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బలమైన ఆకాంక్షను తమ పార్టీ మేనిఫెస్టో కమిటీ దృష్టికి, పార్టీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్, మండల అధ్యక్షులు దాసరి క్షేమమూర్తి, ప్రధాన కార్యదర్శి కేతా నాగరాజు, కోశాధికారి సిహెచ్ త్రినాధ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పాత పెన్షన్ విధానాన్ని ఏ పార్టీ మేనిఫెస్టోలో పెడుతుందో ఆ పార్టీకి తమ మద్దతు ఉంటుందని ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం యుటిఎఫ్ నాయకులు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.కృష్ణమోహన్, సిహెచ్.శ్రీనివాస్, కోశాధికారి కె.బ్రహ్మయ్య, ఎన్.బుజ్జి బాబు ఉన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ఆచంట:గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలు అభినందనీయమని సర్పంచి గణేశుల శేషావేణి సుబ్బారావు అన్నారు. శుక్రవారం పెనుమంచిలి గ్రామ సచివాలయం వద్ద వాలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వాలంటీర్లు విశేష సేవలందించారన్నారు. అనంతరం వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గంటి వెంకట మహేలక్ష్మి, వార్డు మెంబర్లు వర్ధనపు సుశీల, జవజాల జానకి, చిటికెన మంగరావు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడుకు నివాళి

నరసాపురం:పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద కింజరపు ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, సంకు భాస్కర్ నాయుడు, కుమార్ రాజ్ కట్టిమంచ ముత్యాలరావు, పాల్గొన్నారు.

గణపవరం : ఎర్రన్నాయుడు జయంతిని మల్లపురాజుపేటలో టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యళ్ల సుబ్బారావు మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కా శ్రీనివాసరావు, బర్ల కన్నారావు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

ఆచంట:రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు కచ్చితంగా పాటించాలని తహశీల్దార్ పి.శివ్ తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వల్లూరు, భీమలాపురం పాఠశాలల పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ శుక్రవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు వీఆర్‌ఒ, డిపిఎస్ చలం, వెల్ఫేర్ అసిస్టెంట్ జామి దిలీప్ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గణపవరం:ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్లు పి.సంతోషినాయుడు, పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం ఆసుపత్రి పరిధిలోని అన్ని సచివాలయాల వద్ద ప్లేట్ డేను నిర్వహించారు. స్థానిక నాలుగో సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో డాక్టర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే దోమలను నివారించవచ్చన్నారు. సిహెచ్‌ఒ విల్సన్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జి.శ్రీనివాస్, ఎం.యహన్, ఎం.నల్లయ్య, ఎ.కృష్ణ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి : ఉమాబాల

ఆచంట:ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి జరిగిందని నరసాపురం పార్లమెంటరీ వైసిపి ఇన్‌ఛార్జ్ గూడూరి ఉమాబాల అన్నారు. శేషమ్మ చెరువు గ్రామంలో శుక్రవారం ఆత్మీయ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సంక్షేమ పాలన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం ఉమాబాలను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి, గ్రామ సర్పంచి జక్కంశెట్టి శ్రీరాములు, గ్రామ కమిటీ అధ్యక్షులు జక్కంశెట్టి శివ పాల్గొన్నారు.

ఎస్‌డి కాలేజ్ విద్యార్థిని ప్రతిభ

తణుకురూరల్:తణుకు ఎస్‌డి కాలేజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఎంబిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.ఉష్ణశ్రీ దుర్గ తమిళనాడులో జరిగిన జాతీయ ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ సౌత్ జోన్ ఆర్చరీ సోలో ఈవెంట్‌లో తృతీయ స్థానం సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ వివి. సత్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ఎంబిఎ విభాగ అధిపతి కె.సురేష్‌కుమార్ అభినందనలు తెలియజేశారు.

సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజల కోసమే సంక్షేమ పథకాలు సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. మండలంలోని బొండాడ, కోపల్లె గ్రామాల్లో రూ.65 లక్షలతో పలు సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. బొండాడపేటలో జిల్లా ప్రజా పరిషత్ సహాయ నిధులు సుమారు రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కోపల్లెలో అంబేద్కర్ విగ్రహం వద్ద రూ.20 లక్షలతో, పసలపూడిరేవు సమీపంలో రూ.3 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, తుర్పుపేటలో రూ.12 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పుష్పగోర్ల సోమేశ్వరరావు, సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కోలుకులూరి ధర్మరాజు, కోపల్లె సర్పంచి బుడి నాగమణి, కోపల్లె సొసైటీ ఛైర్మన్ వేగేశ్న జయ రామకృష్ణంరాజు, మాజీ సర్పంచి వీరమళ్లు బోస్ పాల్గొన్నారు. జువ్వలపాలెం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సుమారు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కలిదిండి ఇజ్రాయిల్‌రాజు, మండల కో ఆప్షన్ సభ్యులు గుర్రం జార్జి బెనహర్, ముదుండి సురేష్ కుమార్ రాజు, కన్నయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పేరుతో దగా : ఎంఎల్ఎ

పోడూరు:పనికిరాని ముంపు స్థలాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ పేరుతో జగన్ మరోసారి పేదలను దగా చేసేందుకు పాల్పడుతున్నాడని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. పేదలు, మహిళలకు టిడిపి అన్యాయం చేసిందని జగన్ క్రమంగా చెప్పాలని డిమాండ్ చేశారు. కొమ్ముచిక్కాలలో 12వ రోజు శుక్రవారం మన పాలకొల్లు మన ఎంఎల్ఎ రామానాయుడు ఇంటింటి పాదయాత్రలో టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన ముంపు ముంపు భూమిలో సరిహద్దు రాళ్లు కనిపించక స్థలం ఎక్కడుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇళ్ల స్థలాల పేరుతో వైసిపి నాయకులు 25 నుంచి 50 వేలు వరకు వసూలు చేశారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, పెన్మెత్స రామబ్రహ్మ రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం : పివిఎల్

ఉండి:ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం ఉప్పులూరు గ్రామంలోని జగనన్న కాలనీలో జలజీవన్ మిషన్ ద్వారా 21.75 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న పైప్ లైన్ నిర్మాణానికి, ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కాకుండా మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎంపిటిసి నిమ్మల కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

నరసాపురం:పేదలకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పేదలకు ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఇ ప్రభాకర్ పాల్గొన్నారు.

కష్టపడే వారికే సముచిత స్థానం : ఎంఎల్ఎ

భీమవరం రూరల్:పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కామన నాగేశ్వరరావును లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం కామన నాగేశ్వరరావు పట్టణంలోని న్యాయవాదులతో కలిసి స్థానిక క్యాంపు కార్యాలయంలో గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని గుర్తుంచుకొని తగిన విధంగా వారిని పదవులతో సత్కరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు బదుగు అశోక్ బాబు, నియోజకవర్గ అధ్యక్షులు పెటేటి పెద్దిరాజు, కంది కట్ల నాగరాజు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండి:అక్రమ మద్యం కలిగిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన ఉండిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఉండి పెదపేట రేవుకు చెందిన పెదాల రామారావు అక్రమంగా మద్యం కలిగి ఉన్నాడని సమాచారంతో ఆతని ఇంట్లో సోదాలు చేయగా పోలీసులకు నాలుగు విస్కీ క్వార్టర్ బాటిల్స్, రెండు బ్రాంది క్వార్టర్ బాటిల్స్, నాలుగు బీర్లు లభ్యమయ్యాయి. దీంతో పెదాల రామారావుపై ఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

శివ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత శివరామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి నియోజకవర్గ ప్రజానీకానికి ఎటువంటి సమస్య వచ్చినా అధైర్య పడొద్దని, అండగా ఉంటానని శివ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత, ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (శివ) అన్నారు. మండలంలోని కొండేపూడి, రామచంద్రాపురం, కోరుకొల్లు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యాలకు గురైన బాధితులను శివరామరాజు శుక్రవారం పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందించారు. కొండేపూడి గ్రామానికి చెందిన

బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ శివ

థైరాయిడ్ ఆపరేషన్ చేసుకున్న వీరవల్లి స్వాతికి రూ.10 వేలు, చింతపల్లి మంగయ్య రూ.5 వేలు, పాల సత్యవతికి రూ.5 వేలు, పక్షవాతంతో బాధపడుతున్న కుంచె వెంకటరత్నంకు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శివరామరాజు బాధితులకు అండగా ఉంటానని తెలిపారు. నియోజకవర్గ ప్రజానీకానికి ఎటువంటి సమస్యలు ఏర్పడినా శివ స్వచ్ఛంద సంస్థ వారికి అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబరాజు, టిడిపి నాయకులు సామ్రాజ్యం, చింతపల్లి వెంకటేశ్వరరావు, పద్యనాభం, నాగమణి, కోటయ్య, రాంబాబు, బాబూరావు, గాదిరాజు శ్రీనివాసరాజు, మంతెన రవివర్మ ఉన్నారు.

డయల్ యువర్ ఎస్‌పికి 10 ఫిర్యాదులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు జిల్లా ఎస్‌పి అజిత వేజేండ్ల ప్రతి శుక్రవారమూ నిర్వహించిన డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమంలో భాగంగా 10 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్‌పి కార్యాలయ సిబ్బంది తెలిపారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఎస్‌పి శుక్రవారం ఎస్‌పి కార్యాలయంలో ఉదయం 11:00 నుంచి 12:00 గంటల వరకు అర్జీదారులతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇందుకోసం జిల్లా పోలీసు కార్యాలయంలో కేటాయించిన 9000110289 నంబర్‌కు ప్రజలు ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా జిల్లా ఎస్‌పికి తెలియజేశారని తెలిపారు. సమస్యలను ఆయా స్టేషన్ల పోలీసు అధికారులకు ఫోన్ చేసి విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

ఘనంగా రోటరీ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

రోటరీ ఇంటర్నేషనల్ స్థాపించి 119 సంవత్సరాలైన సందర్భంగా పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ ఆధ్వర్యంలో రోటరీ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ కార్యాలయంలో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాంప్రసాద్ ఆర్థిక సహాయంతో సత్యసాయి కాలనీలో కుష్ఠు అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి నడవడానికి స్టిక్‌లు అందజేశారు. డ్రెస్సింగ్ చేసుకునేలా మెటీరియల్, టబ్బులు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ ముత్యాల ప్రదీప్, అసిస్టెంట్ గవర్నర్ ఇమ్మిడి రాజేష్, పాస్ట్ ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాస్, కటారి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే లబ్ధి

ప్రజాశక్తి - ఉండి

ప్రకృతి వ్యవసాయంతోనే లబ్ధి చేకూరుతుందని మార్టేరు బ్రీడింగ్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.చారుమతి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణా తరగతులను ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్రారంభించారు. మొదటిరోజు శిక్షణా తరగతిలో పాల్గొన్న చారుమతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశవాళి వంగడాలను ఉపయోగించినట్లయితే ఆర్థికంగా ఎక్కువ లబ్ధి పొందొచ్చన్నారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు మాట్లాడారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.దెబోరా మెస్సెయాన, పి.వినయ లక్ష్మి, రాజేష్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి కేంద్ర మంత్రి హామీ

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం నార్త్ పంచాయతీలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారని మాజీ ఎంపిటిసి సభ్యులు జనసేన నాయకులు అందే ఫణీంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 350 సంవత్సరాల కిందట చెన్నాప్రగడ వంశీయులు ఆలయ నిర్మాణం చేశారన్నారు. ఆనాటి దాతల వంశీయులు గ్రామస్తులు కోటి రూపాయలు విరాళం అందించేందుకు ముందుకొచ్చారన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి ఆలయ విషయాన్ని తీసుకువెళ్లామన్నారు. స్పందించిన ఆమె ఆలయ పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను సిజిఎఫ్ నిధుల నుండి మంజూరు చేస్తారా లేదా తాను మంజూరు చేయమంటారని అక్కడే ఉన్న రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని అడగగా ఆయన తామే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచి పేరుపాలెం వెంకన్న మాజీ సర్పంచి మేకం బన్ను, విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీరామచంద్రమూర్తి, విశ్రాంత వీఆర్‌ఒ చెన్నాప్రగడ కృష్ణమూర్తి, కటికల బాలాజీ, రామచంద్రరావు పాల్గొన్నారు.

సంక్షేమం జగన్‌తో సాధ్యం : ముదునూరి

ప్రజాశక్తి - పాలకొల్లు

సంక్షేమ పథకాల అమలు వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత రుణమాఫీ కార్యక్రమం డ్వాక్రా సంఘాల అక్క చెల్లెమ్మలకు శుక్రవారం స్థానిక ఆదిబాల గార్డెన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడారు. జగన్ పాదయాత్రలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వడ్డీ రుణాను నూరు శాతం అక్క చెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో 4,172 సంఘాలకు 42,271 మంది అర్హత గల సభ్యులకు రూ. 45.96 కోట్లు నాలుగో విడతకు చెల్లించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల, గుడాల గోపి మాట్లాడారు. అనంతరం డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు నమూనా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజుల నాయుడు, సాల నరసయ్య, పెదపాటి పెద్దిరాజు, చిలుకూరి కుమార దత్తాత్రేయ వర్మ పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల ధర్నా

ఆచంట:రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కుసంపూడి సుబ్బరాజు అన్నారు. వ్యవసాయ వరి పరిశోధనా స్థానం కార్మికులు సమ్మె శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరింది. కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులు వివిధ రూపాల్లో ధర్నా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. ఈ సందర్భంగా పోరాటంలో ప్రాణ వ్యతి చెందిన యువ రైతు శుభకరన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం సుబ్బరాజు మాట్లాడుతూ మోడీ ఇచ్చిన హామీలు తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద కార్మికులు, కౌలు రైతు క్లబ్ ప్రైజ్ జరిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి కోడి ప్రసాద్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

వైసిపిది అరాచక పాలన : ఎంఎల్ఎ

పాలకోడేరు: వైసిపి పాలనలో అరాచక రాజ్యమేలుతోందని, అరాచక పాలనకు అంతమొందించే రోజు ముందుందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మొగల్లులో ఇంటింటా టిడిపి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ఏ ఒక్క వర్గానికి న్యాయం జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వీరవల్లి వెంకటలక్ష్మి, నియోజకవర్గ బిసి నాయకులు కామన రాంబాబు, మాజీ ఎంపిటిసి పెనుమత్స రామరాజు పాల్గొన్నారు. అనంతరం ఎంఎల్ఎ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. కట్టుంగ శ్రీనివాస్, కె.సురేష్, చిల్ల రాజు, చెలుకు విల్లా తాత, కె.మహేష్, వడి కిరణ్ కుమార్, వర్ధనపూడి డేవిడ్, దాసరి సునీల్, దిరిసపాటి అభిషేక్, దొంగ సుబ్రహ్మణ్యంకు ఎంఎల్ఎ రామరాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

మొగల్తూరు:తీర ప్రాంతాలను అనుసంధానం చేస్తూ వంతెన నిర్మాణం చేపట్టాలని మాజీ ఎంపిటిసి సభ్యులు అందే ఫణీంద్రనాద్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం గ్రామస్తులతో కలిసి పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి నెల్లిపల్లె పాలెం ముత్యాలపల్లి పంచాయతీ పరిధి గేదెల్ల వంపు ఉప్పుటేరు ప్రాంతాన్ని సందర్శించి ఆ ప్రాంతంలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం లేకపోవడంతో మూడు దశాబ్దాలుగా నాటు పడవలపై ప్రయాణిస్తూ ఉప్పుటేరులో మునిగి సుమారు 50 మందికి పైగా మృతి చెందారని అన్నారు. ఇక్కడ వంతెన నిర్మాణం చేస్తే తీర ప్రాంత గ్రామాల నుండి జాతీయ రహదారికి వెళ్లేందుకు మార్గం సులువుగా ఉంటుందన్నారు. ఇటీవల నరసాపురం పర్యటనకు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పేరుపాలెం వెంకన్న మాజీ సర్పంచి మేకం బంద్, విశ్రాంత ఉపాధ్యాయుడు చెన్నాప్రగడ శ్రీరామచంద్ర మూర్తి, విశ్రాంత వీఆర్‌ఒ చెన్నాప్రగడ కృష్ణమూర్తి, కటికల రామచంద్రరావు, బాలాజీ ఉన్నారు.

నిట్‌లో వర్క్ షాపులు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాలలో సామాజిక, స్థిరమైన ఆవిష్కరణలపై మొదటి 2024 ఐఇఇఇ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా శుక్రవారం ప్రీ-కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌లు ప్రారంభించారు. మొదటి వర్క్‌షాప్‌నకు ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీపై రిసోర్స్ పర్సన్ దీపేష్ కుమార్ ఎలక్ట్రిక్ వెహికల్ రెట్రాన్ ఎనర్జీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంటరాక్టివ్ సెషన్, ప్రయోగాత్మక ప్రదర్శనల ద్వారా వర్క్‌షాప్ ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో పురోగతి, సవాళ్లు, భవిష్యత్తు అవకాశాలను పరిశోధించడం, పాల్గొనేవారి మధ్య అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సిఎస్ఇ డిపార్ట్‌మెంట్ ద్వారా ఐఒటి అప్లికేషన్లపై అప్లికేషన్-స్పెసిఫిక్ మినిమమ్ సిస్టమ్ డిజైన్ కేస్ స్టడీపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. తమ కళాశాలలో ఈ మొదటి అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో వివిధ దేశాల నుంచి శాస్త్రవేత్తలు, విద్యార్థులు, అధ్యాపకులు 1200 సాంకేతిక రీసెర్చ్ పేపర్స్‌ను పంపడం జరిగిందని, అందులో 170 పేపర్లను ఐఇఇఇ ఎంపిక చేసిందని వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మహ్మద్ ఇస్మాయిల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఇఇఇ కన్వీనర్లు డైరెక్టర్ డాక్టర్ కె.శివకుమార్, విభాగాధిపతులు డాక్టర్ ఎ.ప్రసాద్, బి.కృష్ణమూర్తి, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ ఎంవిఎస్ఎస్ నాగేంద్రనాథ్‌తో పాటు కోఆర్డినేటర్లు, ప్రముఖులు హాజరయ్యారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

ఉండి:ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. శుక్రవారం పెదపుల్లేరులో గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనుల పరిశీలన

నరసాపురం:పట్టణంలోని 14వ వార్డులో శ్మశానవాటిక నిర్మాణ అభివృద్ధి పనులను రాష్ట్ర చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టరును ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకట రమణ జయరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు : యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి తెలిపారు. ఏవి వారియర్స్ కార్యక్రమంలో భాగంగా ఛాంబర్స్ కళాశాలలో నూతనంగా ఓటు హక్కు పొందిన విద్యార్థులకు ఓటు ఆవశ్యకత గురించి ఆమె వివరించారు. యువత సమాజానికి వెన్నెముక అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో రాష్ట్ర భవితవ్యాన్ని మార్చగలిగే శక్తి యువతకే ఉందన్నారు. కార్యక్రమంలో ఛాంబర్స్ కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఆయాల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ఆచంట: సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ఐసిడిఎస్ పెనుమంట్ర కార్యాలయం పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పెనుమంట్ర ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.కృష్ణకుమారి తెలిపారు. పెనుమంట్రలో - 7, జనరల్, మామూడూరు పంచాయతీ పరిధి బొక్కావారిపాలెం బిసి-బి, ములపర్రు - 3, బిసి-ఎ, పెనుగొండ పంచాయతీ పరిధి జలం చెరువు బిసి - బి, ఆచంట పంచాయతీ పరిధి ముత్యాలమ్మ చెరువు గట్టు బిసి - ఎ, ఆచంట వేమవరం మహిళా మండలి జనరల్, ఆచంట వేమవరం పంచాయతీ పరిధి లింగరాజు చెరువు జనరల్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె వివరించారు. అభ్యర్థులు ఈనెల 23 నుంచి మార్చి ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులను ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని కృష్ణకుమారి కోరారు.

ఆకివీడు : ఐసిడిఎస్ ఆకివీడు ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి వి.వాణి విజయలక్ష్మి తెలిపారు. పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామంలో ఒకటో కేంద్రంలో ఒకటి, శృంగవృక్షం శివారు బంటుమిల్లిలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ ఉద్యోగాలకు స్థానికులైన వివాహిత మహిళలు మాత్రమే అర్హులన్నారు. పదో తరగతి పాస్ అయి ఉండాలన్నారు. మార్చి 1వ తేదీలోగా దరఖాస్తులను ఆకివీడు ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు.

విలేకర్లపై దాడి అమానుషం

వీరవాసరం:ఇటీవల రాప్తాడు సభలో విలేకరిపై అమానుషమని సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ శుక్రవారం వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే విలేకర్లపై దాడి చేయడం వారి హక్కులను కాలరాయడమేనని తెలిపారు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో లింగం సత్యనారాయణ, రెడ్డి రామారావు, కేతా జ్యోతిబసు, అయినపర్తి బాబూరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఆచంట: ఆచంట పంచాయతీ పరిధి వంకజ్జల చెరువు గ్రామంలో ఎంపిటిసి బొక్క సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో దేవరపల్లి గుడి నుండి సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు మురళి, శ్రీనివాసరావు, కె.రామేశ్వరరావు పాల్గొన్నారు.

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు

ఆర్.ఓ.సి. నెం. 769/2015/జి1 | ది.23-02-2024

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘము పరిధిలో నందు పురపాలక సంఘ నిధులతో 12వ వార్డులోని శ్రీ వేంకటేశ్వర నిలయం నుండి దాసిరెడ్డి అరిరుద్ & ఏడుకుల నుంచి రత్నపాపి పాపే షాప్ వరకు సి.సి.రోడ్డు, రామపురంపేటలో పుల్ (బ్రిడ్జి) వెడల్పు చేయు నిమిత్తం (2 పనులకు)గాను అంచనాల విలువ సుమారు రూ. 34,95,000/-లతో మరియు GGMP నిధులతో సి.సి.రోడ్డు, సి.సి. డ్రైన్స్ మరియు కల్వర్ట్ నిర్మాణ నిమిత్తం (24 పనులకు)గాను అంచనాల విలువ సుమారు రూ. 1,03,38,000/-లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరబడినవి. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ నందు ది. 24-02-2024వ తేదీ సాయంత్రం 4.00 గం॥ నుండి లభించును.

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్లు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- **బి.ఆర్.యస్.శేషాద్రి**
మునిసిపల్ కమిషనరు, పాలకొల్లు

గ్రామపంచాయతీ కార్యాలయం, దాకరం
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

ఆర్.ఓ.సి. నెం.05/2024 | **టెండరు ప్రకటన** | తేది.22-02-2024

ముదినేపల్లి మండలం, దాకరం గ్రామపంచాయతీ యందు 2024-25 సంవత్సరమునకుగాను ఈదిగువ సదరించిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేదరుగు నిర్ణయం చేయుటకు ది. 28-02-2024వ తేదీ మధ్యాహ్నం గం॥ 12.00లకు దాకరం గ్రామపంచాయతీ కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించి, తిరిగి అదేరోజు మధ్యాహ్నం గం॥ 2.30 ని॥లకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. మిగిలిన వివరములు కార్యాలయ పనివేళల యందు తెలుసుకొనవచ్చును.

క్ర.సం.	పని వివరములు	పనిచేయు కాలము	డిపాజిట్టు
1	పారిశుధ్య పనుల నిర్వహణ 1. కార్యాలయ పనుల నిమిత్తం 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	
2	PWS స్కీము నిర్వహణ స్కీము మోటారు ఆపరేటరుగా విధులు నిర్వహించుటకు 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	రూ. 3000/-
3	ఎలక్ట్రీషియన్ - వీధి దీపములు రిపేర్లు చేయుటకు 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	

సం/- **జాస్తి రాఘవేంద్రరావు**
సర్పంచ్, గ్రామపంచాయతీ, దాకరం
ముదినేపల్లి మండలం

సం/- **కె.శ్రీనివాసరావు,** పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, దాకరం
ముదినేపల్లి మండలం

పూడుకుపోయిన డ్రెయిన్ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - నరసాపురం

వేములదీవి-పడమర గ్రామంలో ఆక్రమణకు గురై పూడుకుపోయిన వెస్ట్ కుక్కిలేరు మైనర్ డ్రెయిన్ తవ్వకం పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ గ్రామ రైతులు శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ డ్రెయిన్ పూడుకుపోవడం వల్ల ముంపునీరు బయటకు పోయే మార్గంలేదన్నారు. ఇప్పటికే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వ సబ్సిడీలు తగ్గింపుతో పెట్టుబడులు పెరిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయ కార్యదర్శి కె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తుమ్మా సత్యనారాయణ, పరసా నరసింహస్వామి, బొక్కా సత్యనారాయణ, బొక్కా ఆంజనేయులు, తుమ్మా సూర్యారావు, కవురు సత్యనారాయణ, కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి టిడిపి, జనసేనతోనే సాధ్యం

మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

అసలైన అభివృద్ధి సంక్షేమం టిడిపి, జనసేనతోనే సాధ్యమవుతుందని తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం అత్తిలి మండలంలోని గ్రామాల్లో సకల జనుల చైతన్య యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అవినీతి తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. రానున్న 50 రోజులు టిడిపి కార్యకర్తలకు పరీక్షా కాలమని బాగా పనిచేసే పార్టీని అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. యాత్రకు గ్రామాల్లో మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఒరగిరులో నూతన సంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, పార్టీ అత్తిలి మండల అధ్యక్షులు ఆనాల ఆదినారాయణ, నాయకులు సత్యనారాయణ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ఆచంట:టిడిపి, జనసేన కూటమిలో విజేపి చేరికతో వైసిపి ప్రభుత్వం కుమురుగుతుందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర మండలం మార్టేరు శివారుపేట, నెగ్గిపూడిలో ప్రజా వేదిక పితాని పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన పోవాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజల సొమ్ముతో జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని వైజాగ్‌లోను రెండు హెలిప్యాడ్లను పెట్టుకుని ఒగ్గరి ముఖ్యమంత్రిగా నెలకు రూ.320 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఆచంట ప్రజలకు ఇసుక బకాసురుడిగా ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, తెలుగు రైతు అధ్యక్షులు వెలగల బులి రామిరెడ్డి, మాజీ ఎఎంసి ఛైర్మన్ ఎస్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, పేరూరు
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

ఆర్.ఓ.సి. నెం.04/2024 | **టెండరు ప్రకటన** | తేది.22-02-2024

ముదినేపల్లి మండలం, పేరూరు గ్రామపంచాయతీ యందు 2024-25 సంవత్సరమునకుగాను ఈదిగువ సదరించిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేదరుగు నిర్ణయం చేయుటకు ది. 28-02-2024వ తేదీ మధ్యాహ్నం గం॥ 2.00లకు పేరూరు గ్రామపంచాయతీ కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించి, తిరిగి అదేరోజు మధ్యాహ్నం గం॥ 2.30 ని॥లకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. మిగిలిన వివరములు కార్యాలయ పనివేళల యందు తెలుసుకొనవచ్చును.

క్ర.సం.	పని వివరములు	పనిచేయు కాలము	డిపాజిట్టు
1	పారిశుధ్య పనుల నిర్వహణ 1. కార్యాలయ పనుల నిమిత్తం 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	
2	PWS స్కీము నిర్వహణ మోటారు ఆపరేటరుగా పనిచేయుటకు 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	రూ. 3000/-
3	ఎలక్ట్రీషియన్ - వీధి దీపములు రిపేర్లు చేయుటకు 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	

సం/- **శ్రీమతి పుట్టి మాధవిరాణి**
సర్పంచ్, గ్రామపంచాయతీ, పేరూరు
ముదినేపల్లి మండలం

సం/- **కె.శ్రీనివాసరావు,** పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, పేరూరు
ముదినేపల్లి మండలం